సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 17 । నవంబర్ । 2023



రోడ్లకు కొత్త రూపు!
ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రోడ్లు కొత్త రూపు సంతరించుకోనున్నాయి. ఇందుకు అవసరమైన నిధులు మంజూరయ్యాయి. 8లో



ఘనంగా సహస్ర తులసీదళార్చన
విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు 8లో



సింహగిరిపై తిరు నక్షత్ర పూజలు
సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తిరునక్షత్ర పూజలు నాల్గవ రోజు గురువారం కొనసాగాయి. 8లో

న్యూస్‌రీల్

అగ్రిసెట్ ర్యాంకర్ పవిత్రకు సత్కారం



పవిత్ర, ఆమె తల్లిదండ్రులతో చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

వీఆర్‌పురం: ఏపీ అగ్రిసెట్–2023లో 171 ర్యాంక్ సాధించిన మండలంలోని చొప్పల్లి గ్రామానికి చెందిన ఉర్మా పవిత్రను చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అభినందించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గురువారం పవిత్రతోపాటు ఆమె తల్లిదండ్రులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పేదరికంలోను పవిత్రకు తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహం అభినందనీయమన్నారు. ప్రతిష్టాత్మక నైరా వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీలో ఉచితంగా సీటు సాధించి ఈ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. పవిత్రను ఆదర్శంగా తీసుకొని మరింత మంది విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

గొర్ర గేదె దాడిలో వీఆర్వోకు గాయాలు

రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి వీఆర్వో చదల వెంకటరెడ్డి గొర్రగేదె దాడిలో గాయపడ్డారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటరెడ్డి బుధవారం సాయంత్రం లోదొడ్డిలో విధులు ముగించుకుని స్వగ్రామం పాకవెల్లి వెళ్లిన అతను బహిర్భూమికి గ్రామ సమీపంలోని కొండకాలువకు వెళ్లాడు. అదే సమయంలో పొదల మాటు నుంచి దూసుకొని వచ్చిన గొర్రగేదె అతనిపై దాడికిగి దిగింది. అదే సమయంలో పక్కనే ఉన్న చెట్టుచాటుకు వెళ్లి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు గాయాలతో ఉన్న అతనిని ఇంటికి తరలించారు. చికిత్స నిమిత్తం కుటుంబీకులు కాకినాడ జీజీహెచ్‌లో చేర్పించినట్టు లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

రంపచోడవరం: పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల పెంపకంపై మూడు రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్టు కేవీకే కోఆర్డినేటర్ డా. లలితాకామేశ్వరి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9346525191, 7893603449 నంబర్లలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

విలువిద్య పోటీలకు అరకు విద్యార్థులు



పోటీల్లో పాల్గొనే విద్యార్థులతో ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్

అరకులోయ టౌన్: జాతీయ స్థాయి విలువిద్య చాంపియన్ షిప్ పోటీల్లో అరకులోయ ఏపీ గిరిజన సంక్షేమ బాలుర స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొంటున్నట్టు ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈనెల 22న రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో జరగనున్న ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు పి.నాగేంద్ర బాబు, ఎస్.జయప్రసాద్ పాల్గొంటున్నట్టు ఆయన పేర్కొన్నారు. వారిని కోచ్ సి.సూరిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత సివిల్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

చింతూరు: స్థానిక ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత సివిల్స్ శిక్షణను గిరిజన నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య గురువారం తెలిపారు. ఈ నెల 21 వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీన మొదటి దశ పరీక్ష నిర్వహించిన 28న ఫలితాలు వెల్లడిస్తామన్నారు. వచ్చేనెల 3వ తేదీన రెండవ దశ పరీక్ష నిర్వహించి ఐదవ తేదీ ఫలితాలు వెల్లడించి 12వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. వీరిలో 75 మందిని ఎంపిక చేస్తామని చెప్పారు. వీరికి తొమ్మిది నెలల పాటు ఐటీడీఏ ద్వారా సివిల్స్ ప్రత్యేక శిక్షణ ఇస్తామని పీవో పేర్కొన్నారు.

డోలీ మోతలేని గ్రామాలే లక్ష్యంగా..

'మిషన్ కనెక్ట్ పాడేరు'
- పాడేరు డివిజన్‌లో 1648 రోడ్డు లేని గ్రామాల గుర్తింపు
- 1194 నిర్మాణాలకు రూ.735 కోట్లతో అంచనాలు
- తొలిదశలో 485 రోడ్లకు రూ.296.26 కోట్ల కేటాయింపు
- ప్రస్తుతం రూ.57.81 కోట్లతో 50 రోడ్ల నిర్మాణాలు పూర్తి



జి.మాడుగుల మండలంలో సంబరాలు-జీలుగులగొయ్యి గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం



అరగాడపల్లి -వంట్లమామిడి గ్రామాలకు పూర్తయిన తారు రోడ్డు నిర్మాణం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని డోలీమోత లేని గ్రామాలే లక్ష్యంగా 'మిషన్ కనెక్ట్ పాడేరు'లో రోడ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. కాలినడకతో నిత్యం నరకయాతన పడే గిరిజనులకు రోడ్డు సౌకర్యం అందుబాటులోకి రానుండటంతో సంతోషపడుతున్నారు. ఏజెన్సీలో 485 రోడ్ల నిర్మాణాలను తొలిదశలో ఐటీడీఏ గతేడాది చేపట్టింది.

ప్రతి గ్రామానికి రోడ్డు..

ప్రతి గ్రామానికి 2025 నాటికి రోడ్డు సౌకర్యం కల్పించే లక్ష్యంగా ప్రభుత్వం, పాడేరు ఐటీడీఏలు పని చేస్తున్నాయి. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లోని 244 పంచాయతీలకు సంబంధించి 3,803 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 2,155 గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉండగా 1648 గ్రామాలకు లేదు. వీటిలో 972 గ్రామాలు పూర్తిగా గిరిశిఖరాల్లో ఉన్నందున డోలిమోతపై ఆధారపడ్డాయి. కాలి నడకన వెళ్లేందుకు వీలుగా 676 గ్రామాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మొత్తం 1648 గ్రామాలకు 1194 రోడ్లు అందుబాటులోకి రానున్నాయి. సుమారు 3,215 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణాలకు గాను రూ.735 కోట్ల అంచనా వ్యయంతో పాడేరు ఐటీడీఏ శ్రీకారం చుట్టింది.

తొలిదశలో రూ.296.26 కోట్ల కేటాయింపు

తొలిదశలో 485 రోడ్లకు ప్రభుత్వం, పాడేరు ఐటీడీఏలో జాతీయ ఉపాధి హామీ పథకం (మెటల్ కాంపోటెంట్)నిధులు రూ.296.26 కోట్లు మంజూరయ్యాయి. వీటితో 1180 కిలోమీటర్ల రోడ్లు నిర్మించి 696 గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించే లక్ష్యంగా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికి రూ.57.81 కోట్లను ఖర్చుచేసి 60 రోడ్ల పనులను పూర్తి చేశారు. సుమారు 150 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి చెందడంతో మారుమూల గ్రామాల గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల తారురోడ్డు సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చింది.

సంతోషంగా ఉంది



గతంలో పాలకులు మారుమూల గ్రామాలను నిర్లక్ష్యం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి మారుమూల గ్రామాలకు అంచెలంచెలుగా రోడ్ల సౌకర్యం అందుబాటులోకి వస్తోంది. ప్రధాన సమస్య పరిష్కరిస్తున్న ప్రభుత్వం, పాడేరు ఐటీడీఏలకు రుణపడి ఉంటాం.

– ఎం.రాజులమ్మ, సర్పంచ్, కోరాపల్లి, జి.మాడుగుల మండలం

రోడ్ల సమస్య పరిష్కరిస్తాం



ప్రతి గ్రామానికి రోడ్డు నిర్మించాలన్న లక్ష్యంతో ఐటీడీఏ పనిచేస్తోంది. మొదటి దశలో మంజూరు చేసిన 485 రోడ్ల నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నాం. త్వరలోనే గిరిజన గ్రామాలకు రోడ్ల సమస్య పరిష్కారమవుతుంది.

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో, పాడేరు

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- 30న హుకుంపేటలో సామాజిక సాధికార సభ



హుకుంపేటలో స్థలపరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: అరకు నియోజకవర్గంలోని హుకుంపేట మండల కేంద్రం వేదికగా ఈ నెల 30న నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. బస్సు యాత్ర, సభ నిర్వహించేందుకు స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆయన స్థానిక నేతలతో మాట్లాడారు. సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతానికి సంబంధించి నాయకులు కార్యకర్తలు, కన్వీనర్లు, గృహసారథులు బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి భారీగా గిరిజనులు తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సివేరి కొండలరావు, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ పాల్గొన్నారు.

దివ్యాంగుల ప్రత్యేక శిబిరం రేపు

గంగవరం : ఈ నెల 18న గంగవరంలో దివ్యాంగులు, వయో వృద్ధులకు అవసరమైన ఉపకరణముల మంజూరుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటుచేసినట్టు ఎంపీడీవో శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, చంకకర్రలు, శ్రవణ యంత్రాలు, ఇతర ఉపకరణాలు మంజూరురే ఎంపిక జరుగుతుందన్నారు.ఉపకరణముల కోసం దరఖాస్తు చేసుకునే వారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసే శిబిరంలో సంబంధిత ధృవీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డులతో హాజరు కావాలని ఆయన కోరారు.

వై.రామవరంలో నేడు..

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో బి.శ్రీనివాసులు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు క్యాంపు కొనసాగుతుందన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని దివ్యాంగులతో గ్రామ వలంటీర్లు, సిబ్బంది తప్పని సరిగా హాజరు వావాలని ఆయన కోరారు. దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తారని ఎంపీడీవో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి

ముంచంగిపుట్టులో విషాదఛాయలు



ఉద్యోగి శ్రీనివాసరావు మృతదేహం

ముంచంగిపుట్టు: మండలంలోని వనబసింగి సమీపంలోని బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి కుర్తాడి శ్రీనివాసరావు (48) మృతి చెందినట్టు ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీతగుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుర్తాడి శ్రీనివాసరావు విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ముంచంగిపుట్టు బయలుదేరాడు. వనబసింగి గ్రామ సమీపంలోని రోడ్డు దాటుతున్న పూజారి బలరామ్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అక్కడి నుంచి శ్రీనివాసరావు స్థానిక సీహెచ్‌సీకి తీసుకువస్తుండగా మార్గమధ్యలోని మృతిచెందాడు. బలరామ్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడని ఎస్‌ఐ తెలిపారు.

మూకుమ్మడి దాడి వల్లే మృతి : రోడ్డుదాటుతున్న బలరామ్ అనే వ్యక్తిని ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడన్న కోపంతో ప్రమాదస్థలంలో కొంతమంది వ్యక్తులు నాభర్త శ్రీనివాసరావుపై మూకుమ్మడి దాడి చేశా రని అతని భార్య రోహిణి ఆరోపించింది. ఈ కారణంగానే మృతి చెందినట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. శ్రీనివాసరావు మృతితో ముంచంగిపుట్టులో విషాదచాయలు అలముకున్నా యి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

డుంబ్రిగుడ: ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతిని ఆమె తల్లిదండ్రులు తీసుకువెళ్లడంతో మనస్థాపానికి గురైన ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోల్లాపుట్టు పంచాయతీ బుసిపుట్టు గ్రామానికి చెందిన యువకుడు కొర్రా శ్రీను(18), అరకులోయ మండలం పద్మాపురం పంచాయతీ పింపలగుడ గ్రామానికి చెందిన వంతల లోకనాథ్ కుమార్తె జ్యోతి ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. వీరిరువురు వివాహం చేసుకుని సోమవారం స్వగ్రామం బుసిపుట్టు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న యువతి జ్యోతి కుటుంబసభ్యులు అదేరోజు అక్కడికి వెళ్లి గొడవకు దిగారు. మంగళ, బుధవారాల్లో కూడా తగాదాకు దిగడమే కాకుండా మారణాయుధాలతో బెదిరించి యువతి జ్యోతిని తీసుకువెళ్లిపోయారని శ్రీను కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన యువకుడు శ్రీను బుధవారం రాత్రి గ్రామ సమీపంలోని పనస చెట్టుకు ఉరేసుకున్నాడని అతని కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వారు పేర్కొన్నారు. ఈ ఘటనపై సర్పంచ్ రామ్మూర్తి పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యం

జీసీసీ ఎండీ సురేష్‌కుమార్



మోదాపుట్టులో కాఫీ గింజల కొనుగోళ్లను ప్రారంభిస్తున్న జీసీసీ ఎండీ సురేష్‌కుమార్

సాక్షి, పాడేరు: కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం పాడేరులో పర్యటించిన ఆయన దిగుమోదాపుట్టు గ్రామంలో కాఫీ కొనుగోళ్లను ప్రారంభించారు. గిరిజన రైతుల నుంచి కాఫీ గింజలను కొనుగోలు చేయడంతో పాటు ఆయా రైతుల వివరాలను ఆన్‌లైన్ చేశారు. అనంతరం ఆయన గిరిజన రైతులతో మాట్లాడారు. జీసీసీకి కాఫీ గింజలను విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. అనంతరం జీసీసీ డీఎం కార్యాలయాన్ని సందర్శించారు. అన్ని బ్రాంచిల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా తనను కలిసిన సాక్షితో జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ గతేడాది వెయ్యి టన్నుల కాఫీ గింజలను కొనుగోలు చేశామన్నారు. ఈఏడాది 1500 టన్నుల కొనుగోలు లక్ష్యంతో జీసీసీ ఉందన్నారు. పార్చ్‌మెంట్ రకం కాఫీ గింజలను కిలో రూ.280, చెర్రి రకాన్ని కిలో రూ.145, రొబాస్టా రకాన్ని కిలో రూ.70కు కొనుగోలు చేస్తామన్నారు. తమ సిబ్బంది, పూలింగ్ ఏజెంట్లతో కలిసి నేరుగా గ్రామాలలోనే గిరిజన రైతుల నుంచి కాఫీ గింజలను కొనుగోలు చేస్తామన్నారు. తూకం, కొనుగోళ్లు పారదర్శకంగా ఉంటాయన్నారు. ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమచేస్తామని ఆయన తెలిపారు. ఈఏడాది మిరియాలను కూడా తొలిసారిగా కొనుగోలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మిరియాల పంట మార్కెటింగ్‌కు గిరిజనుల నుంచి వినతులు వస్తున్నాయన్నారు.అటవీ,వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నందున గిరిజన రైతులు జీసీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం వన్‌ధన్ వికాస యోజనలో మహిళల అడ్డాకుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు, పాడేరు డీఎం డి.సింహచలం, పలు బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.

నేడు పాడేరు ఐటీడీఏలో స్పందన

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఈనెల 17వతేదీ శుక్రవారం పాడేరు జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.అన్నిశాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, ఉదయం 10గంటలకు స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతులు స్వీకరిస్తామని ఆయన తెలిపారు.

జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా గిరిబాబు



గిరిబాబును అభినందిస్తున్న చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీలు

ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులు



గిరిబాబుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్‌గా సుంకర గిరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీకి చెందిన జెడ్పీటీసీలు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం విశాఖ జెడ్పీ సమావేశ మందిరంలో వైస్ చైర్‌పర్సన్ పదవికి ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీకి చెందిన 25 మంది జెడ్పీటీసీ సభ్యులు హాజరయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్, ముంచంగిపుట్టు జెడ్పీటీసీ సభ్యురాలు జె.సుభద్ర.. పద్మనాభం జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు పేరును వైస్ చైర్‌పర్సన్ పదవికి ప్రతిపాదించారు. పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు బలపరిచారు. ఈ పదవికి మరొకరి పేరు ప్రతిపాదనకు రాకపోవడంతో గిరిబాబు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రిసైడింగ్ అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన వైస్ చైర్‌పర్సన్ గిరిబాబును భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జెడ్పీటీసీ సభ్యులు అభినందించారు. అనంతరం గిరిబాబు మాట్లాడుతూ తనకు వైస్ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నెరవేరుస్తానని చెప్పారు.

25 రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే, డీఎఫ్‌వో నరేంథిరన్

రంపచోడవరం: మారుమూల గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి స్క్రీనింగ్ కమిటీ తీర్మానాలతో కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపిస్తామని రంపచోడవరం పీవో సూరజ్ గనోరే తెలిపారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం డీఎఫ్‌వో నరేంథిరన్‌తో కలిసి ఆయన గిరిజన సంక్షేమశాఖ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏజెన్సీలోని ఏడు మండలాల పరిధిలో సుమారు 25 రోడ్ల నిర్మాణానికి అవసరమైన అటవీ అనుమతులపై చర్చించారు. ఒక్కో రోడ్డు నిర్మాణానికి ఎంత అటవీ భూమి అవసరమవుతుందో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీర్లను పీవో ఆదేశించారు. అలాగే పర్యాటక ప్రాంతమైన గుడిసె రహదారి నిర్మాణానికి సర్వే చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ ఏజెన్సీలో మారుమూల గ్రామాలకు రోడ్డు నిర్మాణానికి ముందుగా అటవీశాఖను సంప్రదించిన తరువాత నిర్మాణ పనులు ప్రారంభించాలని తెలిపారు. ప్రతిపాదించిన 25 రోడ్ల నిర్మాణానికి ఏమేర అటవీ భూమి అవసరమో అటవీశాఖ, ఇంజనీరింగ్ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని సూచించారు. రోడ్డు నిర్మాణాలతో పాటు ఎక్కడెక్కడ కల్వర్టులు నిర్మిస్తున్నారో నివేదికలో పొందుపరచాలని సూచించారు. అడ్డతీగల సబ్ డీఎఫ్‌వో బి.రామారావు, టీడబ్ల్యూ ఈఈ జి.డేవిడ్‌రాజ్, డీఈలు చైతన్య, గౌతమి, నాగరాజు, రేంజర్లు ఎం కరుణాకర్, వి. దుర్గాకుమార్, ఎం అబ్బాయిదొర, ఎస్‌ఏ ఆజాద్ పాల్గొన్నారు.

లోయలోకి దూసుకెళ్లిన మినీ వ్యాన్



ఐనాడ ఘాట్‌లో బోల్తా కొట్టిన మినీ వ్యాన్



మృతిచెందిన నూకరాజు

- ఒకరి మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు
- కూలిపనులకు వెళ్తుండగా ప్రమాదం
- ఐనాడ వెళ్లే ఘాట్ రోడ్డులో ఘటన

సాక్షి,పాడేరు: మండలంలోని సలుగు నుంచి ఐనాడ వెళ్లే ఘాట్ రోడ్డులోని మినీ వ్యాన్ అదుపుతప్పింది. లోయలోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ఆరుగురికి తీవ్రంగా, నలుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. రాయికోట సమీపంలో గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను హుటాహుటిన ఈదులపాలెం పీహెచ్‌సీకి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురిని ప్రథమ చికిత్స అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. సలుగు పంచాయతీ ఈదులపాలెం గ్రామానికి చెందిన సుమారు 20మంది గిరిజనులు రాజమండ్రిలోని కూలి పనుల నిమిత్తం రాత్రి మినీ వ్యాన్‌లో బయలుదేరారు. ఐనాడ ప్రాంతంలోని ఘాట్ రోడ్డు వద్దకు వచ్చేసరికి మినీ వ్యాన్ అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మోలం నూకరాజు (28) అక్కడికక్కడే మృతి చెందినట్టు పాడేరు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇలావుండగా నూకరాజు మృతితో ఈదలపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాద సంఘటనపై పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విచారం వ్యక్తం చేశారు. గాయపడిన గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు కల్పించాలని, ఉన్నత వైద్యసేవలకు కేజీహెచ్‌కు తరలించాలని వైద్యబృందాలకు ఆమె సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన

- గిరిజన సంక్షేమ జాయింట్ డైరెక్టర్ ప్రతిభా భారతి
- గుత్తులపుట్టు బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శన



విద్యార్థినులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రతిభా భారతి

సాక్షి, పాడేరు: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని గిరిజన సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.ప్రతిభాభారతి ఆదేశించారు. గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. టెన్త్ విద్యార్థినుల విద్యా సామర్థ్యాన్ని ఆమె పరిశీలించారు. పలు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులను చదువుల్లో ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయులంతా పాఠ్యాంశాలపై సాధన చేసిన తరువాతనే విద్యార్థులకు సమగ్రంగా బోధించాలన్నారు. ఆంగ్లభాషపై విద్యార్థులు మరింత పట్టు సాధించేవిధంగా ఉపాధ్యాయులు శ్రమించాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులు పదికి పది గ్రేడింగ్ సాధించేలా పనిచేయాలని, చదువులో కాస్త వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూను పాఠశాలల్లో కచ్చితంగా అమలు జేయాలని, విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఆమె ఆదేశించారు. డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు వాహనాలు ఢీ.. పది మందికి గాయాలు



బోల్తా పడిన వాహనం

గూడెంకొత్తవీధి: లంకపాకల ఘాట్ రోడ్డులో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పది మంది పర్యాటకులు గాయపడ్డారు. ఒడిశా నుంచి తాడు లోడుతో వెళ్తున్న వాహనం, పర్యాటకులతో ఎదురుగా వస్తున్న చింతూరుకు చెందిన వ్యాన్ ఢీకొన్నాయి. లంకపాకల ప్రాంతంలో నూతిబంద వద్ద జరిగిన ఈ ఘటనలో గాయపడిన పర్యాటకులను సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అప్పలసూరి తెలిపారు.

సింహగిరిపై తిరు నక్షత్ర పూజలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మనవాళ్ మహా మునుల తిరునక్షత్ర పూజలు నాల్గవ రోజు గురువారం కొనసాగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం దివ్యప్రబంధ పారాయాణాన్ని నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పారాయణదారులు, అధ్యాపకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏపీ సెట్ మెంబర్ సెక్రటరీగా జగన్నాథరాజు



వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య రాజు

ఏయూక్యాంపస్ (విశాఖ): రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష (ఏపీ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్టు–ఏపీసెట్) మెంబర్ సెక్రటరీగా ఏయూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు జి.ఎం.జగన్నాథరాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ జీవో జారీ చేసింది. ఈ సందర్భంగా ఆచార్య జి.ఎం.జగన్నాథ రాజును ఏయూ వీసీ పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏపీ సెట్ పూర్వ మెంబర్ సెక్రటరీ ఆచార్య కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్లకు కొత్త రూపు!

- ఉమ్మడి విశాఖ జిల్లాకు రూ.138.25 కోట్లు మంజూరు
- వీటిలో బాగా దెబ్బతిన్న రోడ్లకు రూ.66.55 కోట్లు
- గుంతలు పూడ్చడానికి మరో రూ.71.70 కోట్లు
- ఆరు నుంచి తొమ్మిది నెలల్లో పూర్తి కానున్న పనులు



పద్మనాభం కొండపైకి వెళ్లే రోడ్డు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రోడ్లు కొత్త రూపు సంతరించుకోనున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలున్నాయి. ఈ జిల్లాల్లో పంచాయతీరాజ్ శాఖకు చెందిన కొన్నిచోట్ల రోడ్లు మరమ్మతులకు గురయ్యాయి. మరికొన్ని రోడ్లకు గుంతలు పడ్డాయి. ఇప్పుడు ఇలాంటి రహదార్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టనున్నారు. బాగా దెబ్బతిన్న రోడ్ల స్థానంలో లేయర్లతో సరికొత్తగా వేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ అధీనంలోని రోడ్ల పరిస్థితిపై ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం రాష్ట్రంలో 1,035 కిలోమీటర్ల పొడవున 202 పనులకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.784.23 కోట్లను మంజూరు చేసింది. వీటిలో ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి హై ఇంపాక్ట్ (బాగా దెబ్బతిన్న) 20 రోడ్ల పనులు, 89 గుంతల రోడ్ల పనులు ఉన్నాయి. 85 కిలోమీటర్ల మేర హై ఇంపాక్ట్ రోడ్ల పనులకు రూ.66.55 కోట్లు, 263 కిలోమీటర్ల మేర గుంతల రోడ్ల మరమ్మతు పనులకు రూ.71.70 కోట్లు మంజూరయ్యాయి. జిల్లాల వారీగా చూస్తే విశాఖ జిల్లాలో పద్మనాభం మండల కేంద్రం నుంచి పద్మనాభ స్వామి కొండపైకి వెళ్లే 3 కిలోమీటర్ల హిల్ టాప్ రోడ్డుకు రూ.5 కోట్లు, అనకాపల్లి జిల్లాలో 19 పనులకు రూ.62 కోట్లు మంజూరు చేశారు. వీటికి ఇటీవల టెండర్లు పిలిచారు. ఇక రోడ్ల గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టడానికి ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వం రూ.71.70 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో మొత్తం 89 పనులను చేపడుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 27 పనులకు రూ.35.59 కోట్లు (118.23 కిలోమీటర్లు), అనకాపల్లి జిల్లాలో 49 పనులకు రూ.32.30 కోట్లు (120 కి.మీలు), విశాఖపట్నం జిల్లాలో 13 పనులకు రూ.3.82 కోట్లు (23.52 కి.మీలు) మంజూరయ్యాయి. వీటిలో ఏఎస్సార్ జిల్లాలో 20 పనులకు టెండర్లు పిలవగా, ఏడు పనులు ప్రారంభమయ్యాయి. అనకాపల్లి జిల్లాలో ఎనిమిది పనులకు, విశాఖ జిల్లాలో 13 పనులకు టెండర్లు పిలిచారు. అనకాపల్లి జిల్లాలో మాడుగుల మండలం కేజేపురం – అప్పలరాజుపురం రోడ్డు, చీడికాడ–కోనాం (వయా సిరిజాం) రోడ్డు పనులు ఇప్పటికే పూర్తి చేశారు. మిగిలిన హై ఇంపాక్ట్ రోడ్లు, గుంతలు పూడ్చే పనులు ఆరు నుంచి తొమ్మిది నెలల్లో పూర్తి చేయనున్నట్టు పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు 'సాక్షి'కి చెప్పారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన



డ్రోన్ ప్రదర్శనను తిలకిస్తున్న రైతులు, విద్యార్థులు

అరకులోయ రూరల్: డ్రోన్ ద్వారా రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని ఎంపీడీవో సీహెచ్.వెంకటేష్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మండలంలోని చినలబుడు పంచాయతీలో రైతులకు డ్రోన్ ద్వారా వివిధ వ్యవసాయ ప్రక్రియలపై అవగాహన కల్పించారు.కృషి విజ్ఞాన కేంద్రం కొండెంపూడి అధికారులు రైతులకు వివిధ వ్యవసాయ ప్రక్రియలను వివరించారు. మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ టి.కిషోర్‌బాబు, నేతృత్వంలో గరుడ ఏరోస్పేస్ సిబ్బంది డ్రోన్ ప్రదర్శనలు నిర్వహించారు. రైతులకు డ్రోన్ ద్వారా మందుల పిచికారీ, విత్తనాలు జల్లడం ప్రక్రియలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలోను పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



వినతులు స్వీకరిస్తున్న రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్, కమిషన్ సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పని చేస్తున్నారని రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మైనారిటీలైన ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు సంబంధించిన సమస్యలపై గురువారం కలెక్టరేట్‌లో ఆయన వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 48 సమస్యలపై వినతులు, ఫిర్యాదులను స్వీకరించినట్లు చెప్పారు. వచ్చిన వినతులను సంబంధిత అధికారులకు పంపి.. వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి 67 సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించినట్లు వెల్లడించారు.ప్రభుత్వం మైనారిటీల శ్రేయస్సు కోసం ఎంతగానో కృషి చేస్తోందని, ఎన్నో సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయని వివరించారు. మైనారిటీలకు ఎక్కడ ఏ అన్యాయం జరిగినా, వాటిని లిఖిత పూర్వకంగా కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. మైనారిటీ కమిషన్ సభ్యులు హిదయతుల్లా, సైఫుల్లా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో మైనారిటీల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్న ఉద్దేశంతో కమిషన్ పర్యటిస్తోందన్నారు. మైనారిటీ సంక్షేమ అధికారి ఎస్.జ్యోతి మాధవి, కమిషన్ వైస్ చైర్మన్ ఎ.జాషువా డేనియల్, సెక్రటరీ దుర్గా ప్రసాద్, కమిషన్ సభ్యులు జితేందర్ జీత్ సింగ్, ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పార్సీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

18న జాబ్ మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 18న జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు. హెటిరో సంస్థలో క్వాలిటీ కంట్రోల్, జూనియర్ కెమిస్ట్, జూనియల్ టెక్నీషియన్ విభాగాలలో ఐటీఐ, డిప్లమా, బీఎస్సీ, బీ ఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సులు పూర్తిచేసిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మెడ్‌ప్లస్ సంస్థలో ఫార్మసిస్ట్, సీఎస్ఏ, ఆడిట్ విభాగాల్లో ఉద్యోగాలకు పదో తరగతి, ఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఆరోజు ఉదయం 10.30 గంటలకు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 966609249 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ఎన్నికల ప్రక్రియలో విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. గురువారం తన కార్యాలయం నుంచి అన్ని మండలాల తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో సమావేశంలో పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫారం 6,7,8 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. జీరో డోర్ నంబర్లు, ఒకే ఇంటిలో 10మంది కన్నా ఎక్కువ ఉన్న ఓటర్లు, పీవీటీజీ ఓటర్ల నమోదుపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఆదేశించారు. బూత్ లెవెల్ అధికారులు విచారించి మూడు రోజుల్లోగా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డెత్ కేసులు ఉంటే ఆయా ఓట్లను కూడా తొలగించాలన్నారు.ఎన్నికల కమిషన్‌కు ఎవరు అతీతులు కాదని, కంప్యూటర్ ఆపరేటర్లపై ఆధారపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ మాట్లాడుతూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో తప్పులు ఉన్నాయని పలు రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. బూత్ లెవెల్ అధికారులతో సమావేశాలు నిర్వహించి ఆయా తప్పులను సరిచేయాలని సూచించారు. ప్రత్యేక శిబిరాల ద్వారా ఇటీవల 18వేల మంది ఓటర్లను నమోదు చేశామని,అర్హులైన వారు ఉంటే వారికి అవకాశం కల్పించాలన్నారు.ఈ సమావేశంలో పాడేరు ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ అభిషేక్, రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్, డీఆర్వో అంబేద్కర్ పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



పెదగెద్దాడలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చి ఇచ్చి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో అనేక మార్పులు తీసుకువచ్చిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగుపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని పెదగెద్దాడ ఎంపీపీ పాఠశాలలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదిని ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ వడగల ప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో అనేక పాఠశాలలకు కొత్త భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించినట్టు తెలిపారు.పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జియ్య, సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ, పార్టీ జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు కాపారపు రూతూ, మాజీ ఎంపీపీ అరగాటి సత్యనారాయణరెడ్డి, పండా రామకృష్ణదొర, మంగా తమ్మన్నకుమార్, బొబ్బా శేఖర్, నందూరి రాంబాబు, కొండ్రాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రంపచోడవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకే తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు)లు అన్నారు. మండలంలోని ఆకూరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని వారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఏజెన్సీలో రూ. 100 కోట్లతో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఏళ్ల తరబడి రహదారుల నిర్మాణానికి నోచుకోని అనేక గ్రామాలకు నేడు జగనన్న ప్రభుత్వ పాలనలో రోడ్డు సదుపాయం ఏర్పడుతుందన్నారు. అటవీ హక్కుల ద్వారా పోడు భూములకు పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం సచివాయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కొయ్యలగూడెం గ్రామంలో కాకవాడ నుండి ఆకూరు వరకు రూ. 13కోట్ల 39 లక్షల అంచనా వ్యయంతో నిర్మించే 13 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు శంకుస్థాపన చేశారు.

గ్రామసచివాలయ వ్యవస్థతో సుపరిపాలన



సుండ్రుపుట్టులో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే భవనాల ప్రారంభం

సాక్షి,పాడేరు: గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో పారదర్శకంగా సుపరిపాలన సాధ్యమైందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. సుండ్రుపుట్టు, చింతలవీధిలో గ్రామసచివాలయ భవనాలు, వంతాడపల్లిలో రైతు భరోసా కేంద్ర భవనాన్ని గురువారం ఆమె ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మంచి ఆశయంతో గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. అన్ని శాఖల ఉద్యోగులు స్థానికంగా నాణ్యమైన పౌరసేవలు అందిస్తున్నారని ఆమె తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.తమ ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ప్రతీ కుటుంబానికి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు ప్రభుత్వ సాయం అందించిందన్నారు. ప్రతి ఒక్కరికి మేలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి, సర్పంచ్‌లు వంతాల సీతమ్మ,కొట్టగుళ్లి ఉషారాణి, మాదెల రమణమ్మ, జి.నీలకంఠం, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి,చల్లా చిట్టమ్మ, లకే రామకృష్ణపాత్రుడు, సన్యాసిరావు, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, డైరెక్టర్లు లకే రామసత్యవతి, గబ్బాడ రాజారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి రాంబాబు, పంచాయతీరాజ్ డీఈఈ రవికుమార్, మండల ఇంజనీరింగ్ అధికారి బాబుప్రసాద్, సచివాలయాల ఉద్యోగులు,వలంటీర్లు పాల్గొన్నారు.

గిరిజన మహిళకు పాముకాటు



చింతపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్వతమ్మ

చింతపల్లిరూరల్: మండలంలో గిరి మహిళ పాము కాటుకి గురైన సంఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాలు.. చౌడుపల్లి పంచాయతీ గెంజీగడ్డకి చెందిన వంతల పార్వతమ్మ గురువారం పోలంలో పనులు చేస్తుండగా పాముకాటుకు గురైంది. గమనించిన బంధువులు వెంటనే చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ల్యాండ్ సర్వేయింగ్ కోర్సుకు దరఖాస్తులు

సాక్షి, పాడేరు: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టిన ల్యాండ్ సర్వేయింగ్‌లో సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల కాలవ్యవధి కలిగిన కోర్సులో చేరేందుకు పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 25వతేదీ లోగా తమ కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ జీఎం పాల్ విలియమ్స్, అధికారులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలు విస్తరించి, వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందిస్తామని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్(పబ్లిక్ రిలేషన్స్) పాల్ విలియమ్స్ తెలిపారు. స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో గురువారం వినియోగదారులతో సదస్సు నిర్వహించారు. బిఎస్ఎన్ఎల్ సేవలను సమగ్రంగా వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో సెల్‌టవర్లను ఏర్పాటు చేసి 4జి నెట్‌వర్క్‌ను నిరంతరం అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఫైబర్‌నెట్, ప్రిపెయిడ్, పోస్ట్ పెయిడ్ సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీజీఎంలు జగదీశ్వరరావు, శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసరావు, ఎస్‌డీఈ కిరణ్, జేఈఈ నాగరాజు, టీఏసీ సభ్యుడు త్రినాథ్ పాల్గొన్నారు.

కేవీలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ

దొండపర్తి (విశాఖ) : స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న కేంద్రీయ విద్యాలయ్‌లో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 10, 12 తరగతి డ్రాపవుట్ అయిన నిరుద్యోగులకు పూర్తి వివరాల కోసం శుక్ర, శనివారాల్లో స్కూల్‌లో ఉన్న కంప్యూటర్ ఫ్యాకల్టీని కలవాలని చెప్పారు. కోర్సులో నమోదు కోసం అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోతో కేంద్రీయ విద్యాలయ్‌లో సంప్రదించాలని సూచించారు.

మార్కెటింగ్‌కు ఐటీడీఏ సహకారం



మాట్లాడుతున్న పీవో చైతన్య

చింతూరు: మిషనరీ ద్వారా వచ్చిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడంలో ఐటీడీఏ పూర్తి సహకారాన్ని అందిస్తుందని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువరం జన్ జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి పీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఆరోగ్య సమస్యలు వస్తే ఆర్ఎంపీ వైద్యులను కాకుండా ప్రభుత్వాస్పత్రులకు వెళ్లాలని సూచించారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలన్నారు. నాలుగు మండలాల ఏపీఎంలు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.